# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 83 సోమవారం | 25 సెప్టెంబర్ 2023 | పేజీలు : 08 | వెల రూ. 5


## 30వరకు ఉచిత కార్డియాక్ వైద్య శిబిరం




8లో..




8లో

## యువత ఆర్థికంగా ఎదగాలి

మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూరులో మెగా జాబ్ మేళా

ఎంఎన్‌సీలు సహా 82 కంపెనీలు హాజరు



2లో

## గణేష్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

మేయర్ గుండు సుధారాణి

గ్రేటర్ పరిధిలో 24 నిమజ్జన ప్రాంతాలు



8లో..

## గణపయ్యకు 108 రకాల నైవేద్యాలు

సత్యం సంస్థలో ఘనంగా నవరాత్రి వేడుకలు




# భగ్గుమంటున్న.. నిరుద్యోగులు

**ఆశ చూపి ఆగం చేస్తున్న ప్రభుత్వం**

**గ్రూప్ 1 పరీక్ష రద్దుతో ఆందోళన**

**మళ్లీ ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితి**

**గ్రూప్ 3పై కొనసాగుతున్న సందిగ్ధత**

రాష్ట్రంలో మద్యం నోటిఫికేషన్లు మినహా ఉద్యోగ నోటిఫికేషన్లు సరిగా జరగడం లేదంటూ సీఎం కేసీఆర్ ప్రభుత్వంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. లక్షల్లో అప్పుచేసి భార్య, పిల్లలకు దూరంగా ఉంటూ నెలల తరబడి కష్టపడి పరీక్ష రాస్తే ఏదో ఒక సమస్యను సృష్టించి ప్రభుత్వం వాటిని రద్దు చేయడంపై భగ్గుమంటున్నారు. ప్రభుత్వ విధానాలతో తాము జీవితాలను కోల్పోతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలోనే ఒకసారి పరీక్ష రద్దయినా దిద్దుబాటు చర్యలు చేపట్టకుండా రెండో సారి పరీక్ష నిర్వహించడమేంటని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గ్రూప్ 1 పోటీ పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించలేని దౌర్భాగ్య పరిస్థితిలో ప్రభుత్వం ఉందంటూ దుమ్మెత్తి పోస్తున్నారు. నిరుద్యోగులతో ఆటలాడుకోవడం మానాలంటూ హితవు పలుకుతున్నారు.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి




వివరాలు 2లో..

# భగ్గుమంటున్న నిరుద్యోగులు



**ఆశ చూపి ఆగం చేస్తున్న ప్రభుత్వం**

**గ్రూప్ 1 పరీక్ష రద్దుతో ఆందోళన**

**మళ్లీ ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితి**

**గ్రూప్ 3పై కొనసాగుతున్న సందిగ్ధత**



**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** 'తెలంగాణ ఏర్పాటు దేశ చరిత్రలో ప్రత్యేక ఘట్టం.. అంతులేని వివక్ష, అన్యాయం ఎదుర్కొన్నాం.. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా పోరాడాం.. ప్రత్యేక రాష్ట్రంతోపాటు గోదావరి జలాలను సాధించుకున్నాం.. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పోరాటం మరువలేనిది. రెండు రోజులు ఆలస్యమైనా రాష్ట్ర వ్యాప్తంగా 91,142 ఉద్యోగాలకు నేటి నుంచి భర్తీ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. తమది ఎంప్లాయిమెంట్ ఫ్రెండ్లీ గవర్నమెంట్' అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా 9 మార్చి 2022న బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించారు. అదే విధంగా ప్రతి ఏడు జాబ్ క్యాలెండర్ ను విడుదల చేసి అప్పటివరకు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామంటూ వెల్లడించారు. ఆ తర్వాత నిర్వహించిన పలు సమావేశాల్లో ఇంతపెద్ద మొత్తంలో ఉద్యోగాల కల్పనతో మనం చరిత్ర సృష్టించామని, పోటీ పరీక్షలకు హాజరయ్యే యువతీ, యువకులకు ఉచితంగా శిక్షణా కార్యక్రమం అమలు చేస్తున్నామంటూ ప్రకటించారు. దీంతో నిరుద్యోగులు ఎగిరి గంతేశారు. ఇక తాము ప్రభుత్వ ఉద్యోగ్యాల్లో సెటిల్ అయినట్లు ఫీల్ అయ్యారు. సీఎం ప్రకటించి సంవత్సరంన్నర కావస్తున్నా ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం భర్తీ అయింది లేదు. దీనికితోడు రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గ్రూప్ 1 పరీక్షపై కూడా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని నిరుద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. పరీక్ష రద్దు పాలకుల చేతకానితనానికి నిదర్శనమంటూ మండి పడుతున్నారు.

## ఎదురు చూపులే..

ప్రభుత్వ కొలువులకోసం లక్షలాదిమంది నిరుద్యోగులు ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారు. అసలు తెలంగాణ ఉద్యమమే నీళ్లు, నిధులు, నియామకంనుంచి పుట్టుకొచ్చింది. మా కొలువులు మాకు కావాలన్న ధృడ సంకల్పంతో విద్యార్థులు, నిరుద్యోగులు ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. తెలంగాణ సిద్ధించి రెండు సారి అధికారంలోకి వచ్చిన బీఆర్ ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. ఎట్టకేలకు 9 మార్చి, 2022లో ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో ప్రస్తుతం 91,142 ఉద్యోగ ఖాళీలు ఉన్నట్లు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారు. అందులో కాంట్రాక్ట్ ఉద్యోగులు 11,103 రెగ్యులరైజేషన్ పోగా.. మిగిలిన 80,039 పోస్టులకు నోటిఫికేషన్ల విడుదలను వెంటనే ప్రారంభిస్తామని వెల్లడించారు. దీంతో టీఎస్‌పీఎస్సీ వరుస నోటిఫికేషన్లతో దుమ్ములేపుతుందని అందరూ భావించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలకు నిరుద్యోగులు పాలాభిషేకాలు చేశారు. ముఖ్యమంత్రి ప్రకటించి సంవత్సరంన్నర అయినప్పటికీ నిరుద్యోగులకు ఎదురు చూపులు మాత్రం తప్పలేదు.

## స్పష్టత లేని గ్రూప్ 3..

కొంచెం ఆలస్యమైనా సీఎం కేసీఆర్ ప్రకటించినట్లు ముఖ్యమైన గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 నోటిఫికేషన్లను పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రం లీకేజీతో అప్పటి వరకు నిర్వహించిన పోటీ పరీక్షలనన్నింటినీ ప్రభుత్వం రద్దు చేసి, తిరిగి పరీక్షలను నిర్వహించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఆర్థికంగా చితికిపోయిన నిరుద్యోగులు ఎలాగైనా ప్రభుత్వ కొలువు కొట్టాలన్న పట్టుదలతో తిరిగి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. రెండో సారి గ్రూప్ - 1 పరీక్షను హైకోర్టు రద్దు చేయడంతో నిరుద్యోగులు అసహనానికి గురవుతున్నారు. గ్రూప్ 4 పరీక్ష నిర్వహించినప్పటికీ ఇప్పటి వరకు ఒక్కరికి ఉద్యోగం ఇచ్చింది లేదు. ఇక గ్రూప్-3 నోటిఫికేషన్ ఇచ్చినా పరీక్ష్ ఎప్పుడు నిర్వహించేది ఇంతవరకు ప్రకటించనేలేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలపై, ప్రభుత్వంపై నమ్మకం పోయే ప్రమాదం ఉంది.

## డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించిన టీఎస్‌పీఎస్సీ..

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష రద్దుపై హైకోర్టు డివిజన్ బెంచ్‌ను టీఎస్‌పీఎస్సీ ఆశ్రయించింది. ప్రిలిమ్స్ రద్దు చేస్తూ 23న సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అప్పీలుకు వెళ్లింది. అత్యవసర విచారణకు లంచ్ మోషన్ అనుమతి కోరుతు పిటిషన్ దాఖలు చేసింది. అయితే దీనిపై మంగళవారం విచారిస్తామని హైకోర్టు డివిజన్ బెంచ్ తెలిపింది. కాగా, ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించిన తీరు, పరీక్ష నిర్వహణకు చేపట్టిన జాగ్రత్తలు తదితర అంశాలతో టీఎస్‌పీఎస్సీ అప్పీల్‌కు వెళ్లింది. అందులో ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావించినట్లు సమాచారం. నిరుడు అక్టోబర్ 16న తొలిసారి గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేసిన టీఎస్‌పీఎస్సీ.. ఈ ఏడాది జూన్ 11న నిర్వహించిన పరీక్షలో ఎందుకు అమలు చేయలేదన్న విషయంపై డివిజన్ బెంచ్‌కు స్పష్టత ఇవ్వనున్నది. ప్రిలిమ్స్‌కు హాజరైన 2,33,506 మంది అభ్యర్థుల్లో కేవలం ముగ్గురి కోసం పరీక్షను మళ్లీ వాయిదా వేస్తే మిగిలిన 2,33,503 మంది ఇబ్బంది పడతారని, వారిపై ఆర్థిక భారం పడటంతోపాటు ఎంతో విలువైన సమయం వృథా అవుతుందనే విషయాన్ని ప్రధానంగా ప్రసావించబోతున్నారు. గ్రూప్-1 ఉద్యోగానికి ప్రిలిమినరీ పరీక్షే ప్రధానం కాదని, మెయిన్స్ పరీక్ష కూడా ఉన్నదనే విషయాన్ని బలంగా వినిపించాలని కమిషన్ భావిస్తున్నట్టు తెలిసింది. ఉద్యోగ నియామక పరీక్షకు తొలిసారి టీఎస్‌పీఎస్సీయే ప్రయోగాత్మకంగా బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టింది. సివిల్ సర్వీస్ నియామకాల కోసం





యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే పరీక్షల్లోనూ ఈ విధానం లేదు. నిరుడు అక్టోబర్ 16న ప్రిలిమ్స్ సమయంలో బయోమెట్రిక్ హాజరు తీసుకునేటప్పుడు కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. అభ్యర్థుల్లో చాలా మంది ఒకేసారి పరీక్షా కేంద్రాలకు రావడం, సమయం సరిపోకపోవడం తదితర అంశాలు ఇందుకు కారణం. వీటిని పరిగణనలోకి తీసుకున్న టీఎస్‌పీఎస్సీ రెండోసారి ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించినప్పుడు అభ్యర్థుల సౌలభ్యం కోసమే బయోమెట్రిక్ విధానాన్ని తొలగించింది. ఈ విషయాన్ని అభ్యర్థులందరికీ ముందుగానే తెలియజేయడంతోపాటు ప్రతి పరీక్షా కేంద్రంలో పకడ్బందీగా మూడంచెల తనిఖీలు చేపట్టింది. పరీక్ష జరిగిన రోజు ప్రాథమిక సమాచారం మేరకే అభ్యర్థుల సంఖ్యను తెలిపిన టీఎస్‌పీఎస్సీ.. ఓఎంఆర్ పత్రాల స్కానింగ్ తర్వాత మొత్తం అభ్యర్థుల సంఖ్యను ప్రకటించింది. ఈ అంశాలను కూలంకషంగా హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వివరించాలని కమిషన్ భావిస్తోంది.

# గణేష నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

**మేయర్ గుండు సుధారాణి**

**గ్రేటర్ పరిధిలో 24 నిమజ్జన ప్రాంతాలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ పరిధిలో గణేష నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషాతో కలిసి జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో నగర పరిధిలోని నిమజ్జన ప్రాంతాలైన కోట చెరువు, చిన్న వడ్డేపల్లి చెరువు, కట్టమల్లన్న చెరువు, ఉర్సు చెరువు, బెస్తం చెరువు ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిమజ్జనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రతి సంవత్సరం బల్దియా నేతృత్వంలో అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ గణేష నిమజ్జమం సులభంగా జరుగుటకు బల్దియా పరిధిలోని హనుమకొండ, వరంగల్ లో 24 నిమజ్జన ప్రాంతాలను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. నిమజ్జనానికి 24 క్రేన్ లతో పాటు ప్రత్యేకంగా హైదరాబాద్ లో ఉపయోగించే రెండు భారీ క్రేన్ లను అందుబాటులో ఉంచామన్నారు. చెరువులో నీటి మట్టం ఎక్కువగా ఉన్నందున గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంచాలని, పోలీసు బందోబస్తు, నీటిపారుదల, ఎలక్ట్రికల్, అగ్నిమాపక శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుంకరి మనీషా శివ కుమార్, మరుపల్ల రవి, గుండు చందన పూర్ణ చందర్, అరుణ విక్టర్ తో పాటు బల్దియా ఎస్ ఈ కృష్ణ రావు, సీఎంహెచ్ ఓ డాక్టర్ రాజేష్, ఈఈలు సంజయ్, శ్రీనివాస్, డీఈ రవి కిరణ్, ఏఈలు హబీబ్, సంతోష్, నరేష్, ఎస్సైలు ధరమ్ సింగ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరం..

జీడబ్ల్యూఎంసీ, డీఎంహెచ్ ఓ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం బల్దియాలోని ఇండోర్ స్టేడియంలో మెప్మా సిబ్బందికి ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనీస రషీద్, టీపీఓ రాజేష్ కుమార్ గౌడ్, డీఎంసీ రజిత రాణి, టీఎంసీ రమేష్ తో పాటు డాక్టర్లు జగన్మోహన చారి, హెచ్ ఓడీ డాక్టర్ దుర్గాబాయి, క్యాంపు ఇన్చార్జ్ డాక్టర్ మైదం రాజు, డాక్టర్ జ్ఞానేశ్వర్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కవిత, కిరణ్మయి, కుమారస్వామి, ఎస్సై శ్యామ్ రాజ్, సీఓలు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం



**వరంగల్ వాయిస్, రేగొండ :** స్నేహ యూత్ అసోసియేషన్ గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గోరికొత్తపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ వద్ద సోమవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గణేష్ మహారాజ్ కి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. అనంతరం యూత్ నాయకులు కొబ్బరికాయ కొట్టి అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు మహిళలు యూత్ నాయకులు, అన్ని సంఘాల నాయకులు గణపతి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్నేహయూత్ సభ్యులు, గ్రామ ప్రముఖులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు కేసీఆర్ జవాబు చెప్పాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ల ఆధ్వర్యంలో దేశంలోనే అన్నిరంగాల్లో ముందున్నామంటూ ప్రలోభాలు పలికే అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు రాష్ట్రంలోని నిరుద్యోగులకు తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి విష్ణువర్ధన్ అన్నారు. జరిగిన తప్పిదాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సోమవారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీళ్లు. నిధులు. నియామకాల పేరుతో కల్వకుంట్ల కుటుంబం మరియు తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని రాజకీయ నిరుద్యోగులు మాత్రమే స్వరాష్ట్రం సిద్ధించాక దాని ఫలాలు అనుభవిస్తున్నారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా టీఎస్పీఎస్సీని తక్షణమే ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు.

## పుట్ట మధు ప్రజా ఆశీర్వాద యాత్ర



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సోమవారం బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ప్రజా ఆశీర్వాద యాత్రను ముత్తారం మండలకేంద్రంలో ప్రారంభిస్తున్న సందర్భంలో మంథని రాజగృహాలో పుట్ట మధుకర్ కలిసి తమ మద్దతు తెలిపిన పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతి రెడ్డి, అదేవిధంగా పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు జక్కు రాకేష్‌ను కలిసిన చల్లా తిరుపతి రెడ్డి బృందం, కుదురుపల్లీ గ్రామ ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

## జీవన సాఫల్య పురస్కారానికి ఎంపికైన చల్లా సునీత



**వరంగల్ వాయిస్, కాటారం :** హెల్పింగ్ హాండ్స్ సంస్థ గుర్రం జాషువా జయంతి సందర్భంగా వివిధ రంగాల్లోని కళాకారులను గుర్తించి ప్రతి ఏటా పురస్కారాలను అందజేస్తోంది. ఈ ఏడాది హైదరాబాద్ బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కళారంగాలలో జీవిత కాల జీవన సాఫల్య పురస్కారాన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారిని చల్లా సునీత సంపత్ కు గౌరవ పురస్కారం దక్కింది. ఈ పురస్కారాన్ని ఈనెల 24న విశిష్ట అతిథుల చేత అందుకున్నట్లు చల్లా సునీత సంపత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్ సరోజనమ్మ, సినిమా నటుడు సూరంపూడి సుదర్శన్, నాట్య కళాకారుని అక్షఖాన్, నటుడు ఫాయిజు ఖాన్, బస్ స్టాప్ కోటేశ్వరరావు, నిర్మాత గుర్రపు విజయ్ కుమార్, దర్శకులు ఎం గౌతం, రచయిత కటారి రామయ్య, నిర్మాత కపిల్ దేవ్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు తనకు లభించిన పురస్కారం అదృష్టంగా భావిస్తున్నానని చల్లా సునీత సంపత్ తెలిపారు.

# రైతులకు అండగా సీఎం కేసీఆర్

### మంత్రి సత్యవతి రాథోడ్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా మల్యాల గ్రామంలోని కృషి విజ్ఞాన్ కేంద్రం (కేవీకే)కు అనుబంధంగా హార్టికల్చర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లను రాష్ట్ర గిరిజన స్త్రీ – శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ సోమవారం పరిశీలించారు. హార్టీకల్చర్ కళాశాలలో ఈ ఏడాది నుంచి తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో అడ్మిషన్లు, తరగతుల నిర్వహణ, విద్యార్థులకు సౌకర్యాల ఏర్పాట్లపై మంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ,ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో మహబూబాబాద్ జిల్లా ఎడ్యుకేషన్ హబ్ గా మారింది. రైతు బిడ్డ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయంలో నూతన విప్లవాన్ని సృష్టిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఉద్యాన డిగ్రీ కళాశాలను ప్రారంభంతో ఈ ప్రాంత రైతులకు విద్యార్థులకు ఎంతోగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ ఏడాది అడ్మిషన్లు ప్రారంభించుకోబోతున్నామని, దేశంలో ఎక్కడా లేని విధంగా స్థానిక విద్యార్థులకు 80 శాతం అవకాశాలు కల్పిస్తూ జీవో తీసుకురావడం జరిగిందని తెలిపారు. భవిష్యత్తులో మల్యాల రూపురేఖలు మారనున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే మహబూబాబాద్ జిల్లాలో హార్టికల్చర్ తో పాటు ఇంజినీరింగ్ కళాశాల, మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందన్నారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు విద్యను అందించాలనే సంకల్పంతో అనేక విద్యాలయాలను నెలకొల్పడం జరుగుతుందని తెలిపారు. ఈ సువర్ణ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్పర్సన్ కుమారి అంగోత్ బిందు, శాసనసభ్యుడు శంకర్ నాయక్, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంక, వైస్ ఛాన్సలర్ నీరజ, ప్రొఫెసర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పొదుపు అలవాటు చేసుకోండి



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ శ్రీపతిబాపు అధ్యక్షతన బ్యాంకింగ్ సేవలు ఆర్థిక సాంకేతిక అక్ష్యరాస్యతపై కళాజాత ప్రదర్శనలతో అవగాహన కల్పించారు. అటల్ పింఛన్ యోజన, జీవన యోజన, జీవన జ్యోతి, సురక్ష బీమా యోజన లాంటి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. 18–50సంవత్సరాల వయస్సు గలవారు సంవత్సర ప్రీమియం రూ.436 చెల్లింపుతో ప్రమాద బీమా రూ.25లక్షలు పొందవచ్చని, సాధారణ మరణానికి రూ.2లక్షలు బీమా ఉంటుందని, రూ.20తో 2లక్షల బీమా పొందవచ్చని, బ్యాంక్ లు అందించే అనేక సేవలను గూర్చి వివరించారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ల సేవలు మరింత విస్తృతం కావాల్సిన అవసరం ఉందని సర్పంచ్ శ్రీపతిబాపు అన్నారు. సక్రమంగా ఇచ్చి పుచ్చుకునే సంబంధాలను బట్టి బ్యాంక్ ల మనుగడ ఉంటుందని, తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించాలని, దాని ద్వారా కలిగే అనేక లాభాలను బ్యాంక్ మేనేజర్ లక్ష్మారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో కళా జాత కళాకారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## చల్లా హ్యాట్రిక్ విజయం సాధించాలని సర్పంచ్ పూజలు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హనుమాన్ యూత్ ఆధ్వర్యంలోని మండపంలో కొలువుదీరిన గణపతి దేవుడికి నడికూడ సర్పంచ్ ఊర రవీందర్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ముఖ్యమంత్రి కావాలని, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి పొందాలని, నడికూడ ప్రజలందరూ ఎలాంటి కష్టాలను ఎదుర్కోకుండా ఉండాలని ఆ చల్లని దేవుడు గణపతిని కోరుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ మెంబెర్ కొక్కిరాల శ్రీధర్ రావు, ఊర తిరుపతి రావు, నాయినేని సంపత్ రావు, కొక్కిరాల ప్రకాష్ రావు, ఊర సుమన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

### ఎస్పీ పుల్లా కరుణాకర్



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లాలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా అన్ని చర్యలు తీసుకున్నామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ పుల్లా కరుణాకర్ అన్నారు. సోమవారం వినాయక నిమజ్జన ఏర్పాట్లు, నిర్వాహకులు పాటించాల్సిన నియమనిబంధనల గురించి పత్రికా ప్రకటనలో తెలిపారు. వినాయక నిమజ్జనం చేసే చెరువులు, కుంటలు, నదుల వద్ద ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. గణేష్ ఊరేగింపు సమయంలో గ్రామాల్లో విద్యుత్ తీగలు తగిలి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, అప్రమత్తతగా వ్యవహరించాలని అన్నారు. మంచి కండిషన్ లో ఉన్న వాహనాలను మాత్రమే గణేష్ శోభయాత్రలో వినియోగించాలని సూచించారు. ప్రధానంగా వినాయక ప్రతిమలను ఊరేగించే వాహన డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. విగ్రహాలు తీసుకొని నీటి లోతు వరకు ఎవరూ వెళ్లకూడదని, అందులోనూ ఈతరాని వారు ఎట్టి పరిస్థితుల్లో నీళ్లలో దిగకూడదని ఎస్పీ కరుణాకర్ సూచించారు. నిమజ్జనం రోజున వాహనాలపై డీజేతో కూడిన మ్యూజిక్ సిస్టమును ఉపయోగించడం నిషేధించడం జరిగిందని వెల్లడించారు. ఇతర మతాలకు గానీ ఇతర వర్గాలకు చెందిన వ్యక్తులను లక్ష్యంగా చేసుకొని ఎలాంటి రెచ్చగొట్టే పనులు చేయవద్దని పేర్కొన్నారు. చిన్నారులను నిమజ్జనం ప్రాంతాలకు తీసుకురావద్దని హెచ్చరించారు. మండపాల నిర్వాహకులు, తల్లిదండ్రులు చిన్నారులను నిమజ్జన ప్రాంతాలకు తీసుకురావద్దని ఎస్పీ సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. జిల్లాలో ప్రశాంతంగా శోభయాత్ర నిర్వహణ కోసం ఇప్పటికే అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో ఉత్సవ కమిటీ సభ్యులు, శాంతి కమిటీ సభ్యులలతో పోలిసు అధికారులు సమావేశ నిర్వహించారని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని, ఏదైనా సంఘటన జరిగితే నిర్వాహకులు వెంటనే పోలీసులు తెలియజేయాలని, ప్రజలు సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఎలాంటి వదంతులు, పుకార్లను నమ్మరాదని, ఏమైనా సమస్యలు ఉంటే దగ్గర్లోని పోలీస్ స్టేషన్ గానీ, డయల్–100కు గాని సమాచారం అందించాలని ఎస్పీ కరుణాకర్ కోరారు.

వరంగల్ వాయిస్ Evening Daily
సోమవారం 25, సెప్టెంబర్ 2023
www.warangalvoice.net

# ఆదర్శప్రాయుడు పండిట్ దీనదయాళ్

## బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ ఆదర్శాలతో బీజేపీని బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. నేడు వారి జయంతి సందర్భంగా ఓ సిటీలోని ఎర్రబెల్లి ప్రదీప్ రావు క్యాంపు కార్యాలయంలో వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అధ్యక్షతన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలవేసి, దేశం కోసం వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. ప్రదీప్ రావు మాట్లాడుతూ పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని కార్యకర్తలు, నాయకులు పార్టీ పటిష్టత కోసం పాటుపడాలన్నారు. మనిషి వ్యక్తి వికాసం, సమాజ హితం, విశ్వమానవ కళ్యాణమే లక్ష్యంగా ఏకాత్మ మానవవాదన్ని ప్రతిపాదించి, సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తికే ప్రభుత్వ పథకాల మొదటి ప్రయోజనం చేకూరాలన్న అంత్యోదయ భావనను రూపొందించిన మహనీయుడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అని అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించిన భారతీయ జనతా పార్టీకి పటిష్ట పునాదులు వేసిన గొప్ప దార్శనికుడు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారక్, భారతీయ జన సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, జాతీయ అధ్యక్షుడిగా, ఏకాదత్మ మానవత అంత్యోదయ సిద్ధాంతాన్ని రూపకర్త దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని అన్నారు. నేడు వారి జయంతిని పురస్కరించుకొని వారి సేవలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, సముద్రాల పరమేశ్వర్, రాష్ట్ర కిసాన్ మోర్చ ఉపాధ్యక్షులు మల్లాది తిరుపతి రెడ్డి, మార్టిన్ లూథర్, తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, పిట్టల కిరణ్, సిద్ధం నరేష్, రత్నం క్రిష్ణ కిషోర్, త్రిలోక్, కందిమళ్ల మహేష్, కొప్పుల క్రాంతి, టేకుమట్ల రేణుక, ఇనుముల అరుణ్, గోండా లక్ష్మణ్, బొడ్డు రాఖేష్, ఇనుముల అజయ్, పుప్పాల శ్రీనివాస్, కోట సతీష్, బండి సుజాత, కోమాకుల నాగరాజు, మందా శ్రీనివాస్, ఆకుతోట రాజు, గోకె వెంకటేష్, కుడికాల కిషన్, మార్గం జనార్ధన్, తమ్మిశెట్టి క్రాంతి, తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** బీజేపీ మాజీ అధ్యక్షుడు, జన సంఘ్ పూర్వ అధ్యక్షుడు పండిత్ దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా మానుకోట జిల్లా బీజేపీ కార్యాలయంలో పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఒద్దిరాజు రామచంద్ర రావు మాట్లాడుతూ పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టాలను అనుభవించి భారతదేశంలో ఏకాత్మత మానవత సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి మనుషులందరూ సమానమేనని చాటి చెప్పారన్నారు. చివరికి దేశం కోసం ప్రాణ త్యాగం చేశారని వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మోసంగి మురళి, వరుసు పద్మావతి, మానుకోట అసెంబ్లీ కన్వీనర్ ఎర్రం రెడ్డి సిద్ధార్థ రెడ్డి, బీజేపీ జిల్లా నాయకుడు జాటోత్ మోధిన్ నాయక్, రాధా పటేల్, పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లె సందీప్, పట్టణ కార్యదర్శి చింతల శివకృష్ణ, యువ మోర్చా జిల్లా నాయకులు శంకరబోయిన సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

## పండిట్ దీనదయాళ్ ఆలోచనలు అనుసరణీయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీజేపీ నేత డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో సోమవారం పండిట్ దీనదయాళ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ అతి సామాన్య కుటుంబంలో 1916 సెప్టెంబర్ 25న జన్మించి ఒక శక్తి గా ఎదిగిన మహనీయుడు పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ అని కొనియాడారు. కొందరు మరణించే వరకు జీవిస్తారు.. మరికొందరు మరణించిన తర్వాత కూడా జీవిస్తారని, ఆ రెండోకోవకు చెందినవారే పండిట్ దీన దయాళ్ అని పేర్కొన్నారు. ఒక భారతీయ రాజకీయ నాయకుడు సమగ్ర మానవతా భావజాలం ప్రతిపాదకుడు, భారతీయ జనతా పార్టీ పూర్వపు రాజకీయ పార్టీ భారతీయ జన సంఘ్ నాయకుడని తెలిపారు. పండిట్ దీన దయాళ్ ఆలోచనలు, ఆచరణీయత సమాజంలోని ప్రతి వ్యక్తికి ఆదర్శనీయమని అన్నారు. అట్టడుగునా ఉన్న వ్యక్తికే తొలి ప్రభుత్వ ప్రయోజనం చేకూరాలన్నా వారి అంత్యోదయ ప్రేరణ, ఏకాత్మ మానవతావాదం అందుకు నిదర్శనమని తెలిపారు. వ్యక్తి , సమాజం వేరు వేరు కావని ,రెండింటిలో ఒకే ఆత్మ ఉంటుందంటూ భారత సమగ్ర అభివృద్ధికై పాటుపడిన పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆ మానీయునికి ఘన నివాళులు అర్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, మార్టిన్ లూథర్, జన్ను సుబ్రహ్మణ్యం, ముంద్రాతి వెంకటేశ్వర్లు , సంఘని జగదీశ్వర్, చిలువేరు రాజేందర్, ఉదయ్ సింగ్ , కమలాకర్, రాజకుమార్ , గాదె రవీందర్ , ప్రభాకర్ గుప్తా లక్ష్మణ్ , బొడ్డు రాకేష్, శివ, రమేశ్, దేవు సాంబయ్య, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలగా సీకేఎం కాలేజీ

### ఉత్వర్తులను యాజమాన్యానికి అందించిన ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని సీకేఎం కళాశాలను ప్రభుత్వ పరం చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. అందులో భాగంగా సీకేఎం కళాశాలను ప్రభుత్వ కళాశాలగా నామకరణం జరిగి ఉత్తర్వులు పొందగా నేడు ఎమ్మెల్యే నరేందర్ ఆ ఉత్తర్వులను సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్, యాజమాన్యానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య చందా కాంతయ్య, ప్రొఫెసర్ జయ శంకర్ సర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్ సర్ తో పాటు ఎందరో మహనీయులు ప్రిన్సిపాల్ గా సేవలందించిన ఈ కళాశాలను ముఖ్యమంత్రి కేసీఆర్ జీవో 44అమలుతో చారిత్రక నిర్ణయం ద్వారా సీకేఎం కళాశాల ప్రభుత్వ పరం చేయడమే కాకుండా నేడు చందాకాంతయ్య స్మారక ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలగా నామకరణం జరిగి ఉత్తర్వులు పొందడం, అది తన హయాంలో జరగడం తనకు చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే నరేందర్ అన్నారు. కళశాలలో పని చేస్తున్న 67మంది ఉద్యోగులను, అవుట్ సోర్సింగ్ లో ఉన్నవాళ్లను, కాంట్రాక్ట్ బేసిక్, ఏడేడ్ ఉద్యోగులను అంతిమంగా ప్రభుత్వ ఉద్యుగులుగా గుర్తించే విధంగా ప్రభుత్వం అడుగులేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మనస్ఫూర్తిగా ఉద్యోగులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని స్వయంగా వారే తెలపడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే నరేందర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

## యోగాతో శారీరక దృఢత్వం

### కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** యోగాతోశారీరక దృఢత్వం చేకూరుతుందని, ఎన్నో ఏళ్లుగా యోగాను భారతీయులు అభ్యసిస్తున్నారని కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. గీతాంజలి మహిళా డిగ్రీ పీజీ కళాశాల ఆవరణలో హనుమకొండ, వరంగల్ జిల్లా యోగోత్సవం కార్యక్రమాన్ని యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ యోగాతో మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని అన్నారు. అనంతరం యోగా ఆసనాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వేణుమాధవ్, వెంకట్, యోగా గురువులు, అసోసియేషన్ సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.

## 27న కొండా లక్ష్మణ్ జయంతి

### విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

**వరంగల్ వాయిస్, కాటారం :** మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27న పద్మశాలి ముద్దుబిడ్డ, స్వాతంత్ర సమరయోధులు, మాజీ మంత్రి, తెలంగాణ జాతిపిత, స్వర్గీయ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు కాటారం మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు దోమల సమ్మయ్య, పలువురు సంఘం నేతలు తెలిపారు. మండల కేంద్రమైన గారేపల్లిలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుటకు, అలాగే కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయుటకు గాను భూమి పూజ చేయుటకు నిశ్చయించనైనదని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొంటున్నారని, అలాగే పద్మశాలి కుల సంఘం జిల్లా, డివిజన్, మండలంలోని నాయకులు, కుల బాంధవులు పెద్ద ఎత్తున పాల్గొననున్నట్టు పద్మశాలి సంఘం బాధ్యులు వివరించారు.

## చేప పిల్లల పంపిణీ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని అమ్మపురం గ్రామంలో ముదిరాజ్ లకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముదిరాజ్ కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసేలా నీలి విప్లవం తీసుకొచ్చారన్నారు. సీఎం కేసీఆర్ మనమంతా రుణపడి ఉండాన్నారు. సీఎం కేసీఆర్ మరోసారి ఆశీర్వదించాలని మంత్రి ఎర్రబెల్లి కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు, నాయకులు, ముదిరాజ్ సంఘ సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కాశిబుగ్గలో ముగ్గుల పోటీలు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని కాశిబుగ్గ వర్తక సంఘం ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రంగవల్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి గాను రంగు రంగుల రంగవల్లులు వర్తకం సంఘం వారే మహిళలకు ఉచితంగా రంగులు ఇచ్చారు. దాదాపు ఈ రంగవల్లిలో 34మంది మహిళలు పాల్గొన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ, 10కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం కార్యవర్గ సభ్యులు అధ్యక్షుడు గుండేటి కృష్ణమూర్తి, కార్యవర్గ సభ్యులు మండల ఓంకార మూర్తి, బాంబుల కుమార్, లక్ష్మీ గణపతి కమిటీ అధ్యక్షుడు వంగరి రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు వేముల నాగరాజ్, ఉత్సవ సమితి సేవా సభ్యులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్దన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. పర్వతగిరి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 2810మంది రైతులకు పంట నష్ట పరిహారం (ఇన్ పుట్ సబ్సిడీ) కింద మంజూరైన రూ. 2కోట్ల 7లక్షల 40వేల విలువగల చెక్కులను కల్లెడ లోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి ఎమ్మెల్యే అరూరి రమేష్ రైతులకు అందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని తెలిపారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు భరోసా కల్పించాలని, ఎకరాకు రూ. 10వేల నష్ట పరిహారాన్ని అందిస్తున్న గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ ని కొనియాడారు. రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, సాగు నీరు అందిస్తూ తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం పర్వతగిరి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 11మందికి ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 4లక్షల 65 వేల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# రేపు మల్హర్‌లో పుట్ట మధు ప్రజా ఆశీర్వాద యాత్ర



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మంథని నియోజక వర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్ర రెండో రోజు మల్హర్ మండలంలో జరగనుంది. మండలంలోని తాడిచెర్ల నుంచి పెద్ద తూండ్ల మీదుగా నాగులమ్మ క్రాస్, కొయ్యూరు, కొండంపేట క్రాస్ వరకు జరిగే పాదయాత్రలో పుట్ట మధు పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, బీఆర్ ఎస్ పార్టీ ని గెలిపించాలని కోరరనున్నారు. ఇదిలా ఉండగా రేపు మండలంలో ప్రజా ఆశీర్వాద యాత్ర ఉన్నప్పటికీ మండల బీఆర్ఎస్ నాయకులలో ఎటువంటి హడావిడి, ఉత్సాహం కనిపించక పోవడం గమనార్హం.

# జయముఖిలో ఫార్మసిస్ట్ డే వేడుకలు



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ప్రపంచ ఫార్మసిస్ట్ డే ను సోమవారం జయముఖి కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు నర్సంపేట అంబేద్కర్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నర్సంపేట ప్రభుత్వ హాస్పిటల్ ఫార్మసీ హెడ్ పసునూరి సుధాకర్, నర్సంపేట ఎస్సై శీలం రవి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. విద్యార్థిని, విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీని కొనసాగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ వాసుదేవ మూర్తి మాట్లాడుతూ సమాజంలో వైద్యులతర్వాత ఫార్మసిస్టులకే ప్రాముఖ్యత ఉందన్నారు. ఔషధాలను తయారు చేయడంతో పాటు రవాణా పంపిణీ వినియోగం అన్ని ఫార్మసిస్టుల పర్యవేక్షణలోనే జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిప్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిల్ కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అశ్విన్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు మనదే.. కష్టపడి పని చేయండి

## ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండల అభివృద్ధి కోసం ఎమ్మెల్సీ నిధుల నుంచి నిధులు ఇవ్వాలని కోరుతూ సోమవారం హైదరాబాద్ లో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని స్థానిక జడ్పీటీసీ, జిల్లా జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు బొల్లం అజయ్ మణికంఠ విజ్ఞప్తి చేశారు. జడ్పీటీసీ మాట్లాడుతూ రఘునాథపల్లి మండల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని, మరిన్ని నిధులు తెచ్చి మండలాన్ని అభివృద్ధికి చేస్తానని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, భవిష్యత్తు మనదేనని, కష్టపడి పని చేయండని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ మండల నాయకులు హరీష్ గౌడ్ దుబ్బాక, ఎడ్ల భాస్కర్, ఎడ్ల బాలరాజు, మహేందర్ రెడ్డి మరికాల తదితరులు పాల్గొన్నారు.

# రాజు, అంబేద్కర్‌లకు మహాత్మా గాంధీ ఫెలోషిప్ అవార్డు





**వరంగల్ వాయిస్, వరంగల్ :** హైదరాబాదులో పీవీఎన్ రెడ్డి కన్వెన్షన్ హాల్ లో ఇంటర్నేషనల్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇంటర్నేషనల్ వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ పి.రవీంద్ర అధ్యక్షత వహించగా ఇంటర్నేషనల్ వాకర్ అసోసియేషన్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. డిసెంబర్ 23, 24న వైజాగ్ లో జరిగే అంతర్జాతీయ వాకర్ అసోసియేషన్ సమావేశాన్ని విజయవంతం చేసేందుకు సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి అందులో వాకర్ అసోసియేషన్ల అభివృద్ధి, పనితీరు స్వచ్ఛంద కార్యక్రమాలు, సమస్యలపై కూలంకశంగా చర్చించారు. ఏ విధమైన కార్యక్రమాలు చేయాలి, ప్రజలకు ఉపయోడపడే కార్యక్రమాలు ఎలా చేయాలనే దాని పై చర్చ జరిగింది. సమావేశంలో వరంగల్ 30వాకర్ అసోసియేషన్ రీజినల్ కోఆర్డినేటర్ తడక కుమార్ స్వామి, దేశిని లక్మి, నర్సయన్ లక్ష్మీనారాయణ, గవర్నర్ సారంగపాణి ఆధ్వర్యంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంగలీల మైదానం వాకర్స్ అసోసియేషన్ డిప్యూటీ గవర్నర్ కస్తూరి రాజు, ఆసోసియేషన్ అధ్యక్షుడు బోమ్మల్ల అంబేద్కర్ లకు మహాత్మా గాంధీ ఫెలోషిప్ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో కురాకుల భారతి, ఎల్లగౌడ్, శ్రీనివాస్, శంకరన్న, కునూరు వేణుగోపాల్, రాజ్ కుమార్, శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

# మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



**వరంగల్ వాయిస్, దేవరుప్పుల :** మండలంలోని కడవెండి గ్రామంలో 3వ విడత ఉచితంగా కుట్టు మిషన్ శిక్షణ పూర్తైన మహిళా సభ్యులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఉచితంగా కుట్టు మిషన్లను ఎంపీపీ బస్వా సావిత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సావిత్రి మాట్లాడుతూ మహిళలు ఎవరి మీద ఆధారపడకుండా తన సొంత కాళ్లపై నిలబడి జీవించడానికి మన మంత్రి అండగా నిలుస్తున్నారని అన్నారు. కడవెండి సర్పంచ్ పోతిరెడ్డి బెత్లీనారెడ్డి, దేవునిగుట్ట సర్పంచ్ బానోత్ బాలు నాయక్, కడవెండి ఎంపీటీసీ దుబ్బాక కవిత రత్నాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ కాశబోయిన నాగేష్, బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు తాటిపెల్లి మహేష్, రైతు కోఆర్డినేటర్ పోతిరెడ్డి లీనా రెడ్డి, ఏపీఎం వెంకట్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు నల్లా ఉమ, సీసీ రాంచంద్రు, ట్రైనర్ మాధవి, సీఏలు భిక్షపతి, మల్లయ్య, సరళ, అనిత, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్నా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 8వ రోజు మహా అన్నదానాన్ని టీ పీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కల్లా అన్నదానం గొప్పదని అన్నారు. ఆ విగ్నేశ్వరుడు కరుణించి అందరికీ మంచి చేయాలని కోరుకున్నారు. సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక దయానంద్ కాలనీ వాసులు దేవసాని శ్రీనివాస్, గూడ గోవర్ధన్, కాప శ్రీనివాస్, సర్వర్యా సురేష్ కుమార్, దేవసాని ఉపేందర్, జంగం ప్రభాకర్, గుండం సురేందర్, కొంక వెంకటేశ్వరరావు, గూడ శారద, జంగం రజిత, దేవసాని కీర్తి, బోళ్ల సుజాత, సిద్ధి వినాయక యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజలందరూ సంతోషంగా ఉండాలి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** విఘ్నేశ్వరుడి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి ఒక్కరూ బాగుపడాలని జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పోకల శివకుమార్ గుప్తా, వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కూరెళ్ల పెద్ద ఉపేందర్ గుప్తా అన్నారు. సోమవారం రఘునాథపల్లి మండల కేంద్రంలో గణపతి నవరాత్రి ఉత్సవాల భాగంగా మహా అన్నదానం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరం గణపతి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైశ్య సంఘం ప్రముఖులు ఓరుగంటి శంకర్ లింగం గుప్తా, శ్యామ్ శెట్టి, శంకరయ్య గుప్తా, శ్రీనివాస్ బచ్చు, చిరంజీవి, గందే రవి, పోకల పోషన్న, గందే వీరయ్య, మాజీ సర్పంచి మొహమ్మద్ బాష్మియా, కడారి శివ, శ్రీకాంత్ కడారి, సురేష్, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శాయంపేటలో..



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో నేతాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద ఆదివారం శాయంపేట ఎంపీటీసీ2, ఉప సర్పంచ్ ధైనం పెల్లి సుమన్ ఏర్పాటుచేసిన మహానదాన కార్యక్రమాన్ని వరంగల్ రూరల్ జడ్పీ చైర్ పర్సన్ గంధ జ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముందుగా వినాయక మండపం వద్ద చైర్ పర్సన్ గంఢ్ర జ్యోతి, ఉప సర్పంచ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. శాయంపేటలోని బీసీ కాలనీలో వినాయక మండపం వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్సై డి.దేవేందర్, సర్పంచ్ కందగట్ల రవి ప్రారంభించారు. ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, పీఏసీఎస్ చైర్మన్ కుసుమ శరత్, అల్లం వారి, బుచ్చిబాబు, బత్తుల శ్రీధర్, భాషని బాలకృష్ణ, ఉప్పు నరసయ్య పాల్గొన్నారు.

# చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని లింగాపురం అంగన్వాడీ సెంటర్ లలో పోషణ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్టు సర్పంచ్ తప్పేట రమేష్ తెలిపారు. ఈ సందర్బంగా సర్పంచ్ తప్పేట రమేష్ మాట్లాడుతూ చిరు ధాన్యాలలో ఔషధ గుణాలు కలిగి ఉండి ఆరోగ్యానికి మేలు చేస్తాయని, ఎన్నో వ్యాధులను నివారించుటలో చిరుధాన్యాలు తొడ్పాడుతాయన్నారు. ముఖ్యంగా ఉబకాయం, అర్థరైటీస్, మధుమేహం, కొలేస్ట్రాల్, గుండె సంబంధిత వ్యాధులకు ప్రత్యేక ఆహారంగా తీసుకోవచ్చని ప్రాణాంతకమైన క్యాన్సర్ లను కూడా నివారిస్తాయని, ముఖ్యంగా గర్భిణీలు, చిన్న పిల్లలకు ఆహరంగా ఇవ్వాలన్నారు. చిరుధాన్యాలలో ఖనిజ లవణాలైన, ఇనుము, జింక్, మెగ్నీషియం, పాస్ఫరస్, ఫోలిక్ ఆసిడ్, రైభోఫ్లెవిన్ అను విటమిన్స్ అధిక సంఖ్యలో ఉండి ఆరోగ్యాన్ని కాపాడుతాయని, ఆకుకూరలు అధికంగా తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దయాకుమారి, పంచాయతీ కార్యదర్శి శ్వేత, ప్రధానోపాధ్యాయులు జయశ్రీ, రవీందర్, ఏఎన్ఏం శ్వేత, అంగన్వాడీలు ఊర్మిళ, హేమలత, ఆశా వర్కర్స్ సంధ్య, అరుణ, శారద, తేజ, మహిళలు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
సోమవారం 25, సెప్టెంబర్ 2023
www.warangalvoice.net

# వంట కార్మికులకు పెంచిన వేతనాలు చెల్లించాలి

## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జక్కు రాజు గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మధ్యాహ్న భోజన వంట కార్మికులకు పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసి జిల్లా అధ్యక్షుడు జక్కు రాజు గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా కార్యక్రమం మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధర్మల రామ్మూర్తి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జక్కు రాజు గౌడ్ హాజరై మాట్లాడుతూ గత 22 సంవత్సరాల నుంచి మధ్యాహ్న భోజన వంట కార్మికులు ప్రభుత్వ విద్యా సంస్థల్లో అందించేందుకు తీవ్రంగా శ్రమించి నాణ్యమైన భోజనాన్ని అందించడం జరుగుతుందన్నారు. కానీ ప్రభుత్వం ఒక బియ్యం మాత్రమే సరఫరా చేయడంతో మిగతా వస్తువులను వంట కార్మికులు సమకూర్చుకొని భోజనం అందించడంలో అనేక ఇబ్బందులు పడుతున్నారని, డబ్బులు వడ్డీలకు తెచ్చి సరైన సమయానికి డబ్బులు రాక మరోవైపు కూరగాయలు, నిత్యాసరాల ధరలు, గ్యాస్ తదితర వాటి ధరలు భారీగా పెరిగినా భోజనం అందిస్తున్నారన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వంట కార్మికులకు జూలై నెల నుంచి రూ.3000 అందిస్తామని చెప్పి కార్మికుల డిమాండ్స్ ను రాష్ట్ర ప్రభుత్వం చర్చించి పరిష్కారం చేస్తామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పినా, ఏ ఒక్కటి కూడా అమలు చేయడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపలేదన్నారు. ఈ సమ్మెను అర్థం చేసుకొని వంట కార్మికుల దుర్భర జీవితాన్ని గమనించి వారి న్యాయమైన డిమాండ్ ను నెరవేర్చాలని జక్కు రాజు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్ పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు మాలోతు శంకర్ నాయక్, వైనాల విజయ, కవిత, ఇందిరా, లక్ష్మి, ఐలయ్య, పద్మ, జనగాని లక్ష్మి, స్వరూప, తోకల రమ, అజ్మత్ బేగం తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటాం

## ఎమ్మెల్యే అరూరి రమేష్



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన సాతుపల్లి ఉప్పస్వామి రోడ్డు ప్రమాదంలో మరణించారు. బీఆర్ఎస్ పార్టీ క్రియాశీల సభ్యత్వం తీసుకున్న వీరికి పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన రూ. 2లక్షల పార్టీ ఇన్సూరెన్స్ చెక్కును బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ స్వయంగా వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా క్రియాశీల సభ్యత్వం ద్వారా రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందచేసిన ఎమ్మెల్యే అరూరి రమేష్ కు, ముఖ్యమంత్రి కేసీఆర్ కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్పీఎస్సీ బోర్డును రద్దుచేయాలి

## బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు



వరంగల్ వాయిస్, హనుమకొండ : బహుజన సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాలసముద్రం అంబేద్కర్ సర్కిల్లో గ్రూప్-1 పరీక్ష రెండోసారి రద్దయినందుకు గాను టీఎస్పీఎస్సీ కమిషన్ బోర్డును రద్దుచేసి కొత్త కమిటీ ఆధ్వర్యంలో రాబోయే గ్రూప్ పరీక్షలు నిర్వహించాలని సోమవారం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజు మాట్లాడుతూ తెలంగాణ నిరుద్యోగ బిడ్డల పక్షాన నిలబడ్డందుకు న్యాయ వ్యవస్థకు మరోసారి ధన్యవాదాలు తెలుపుతూ గ్రూప్-1 రెండోసారి రద్దు కావడానికి ముమ్మాటికి కేసీఆర్ నిరంకుశ కుటుంబ పాలననే కారణమని అన్నారు. ఆనాడే బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేసినట్లుగా మొత్తం కమిషన్ ను ప్రక్షాళన చేసి పరీక్షలను నిర్వహించి ఉంటే ఈ పరిస్థితి వచ్చుండేది కాదని అన్నారు. ఇంకా టైం వేస్టు చేయకుండా టీఎస్పీఎస్సీ కమిషన్ మొత్తం అర్జంటుగా రాజీనామా చేయాలని, డా.జనార్ధన్ రెడ్డి మీకు ఏ మాత్రం నైతిక విలువలున్నా స్వచ్ఛందంగా వైదొలగి పోలీసులకు నిజం చెప్పాలని డిమాండ్ చేశారు. కమీషన్ ను పూర్తిగా ప్రక్షాళన చేసి కొత్త వారిని నియమించిన తరువాతనే మిగతా పరీక్షలను నిర్వహించాలని కోరారు.
ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటేరు చక్రి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మంజుల మనీ, కోశాధికారి పసుపునాటి నితీష్ కుమార్, పరకాల నియోజకవర్గ ఇంచార్జి అమ్మ సాంబయ్య, సూదనబోయిన సాంబయ్య, మేకల విష్ణు, వందలమంది విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు చేరికలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు



**వరంగల్ వాయిస్, శాయంపేట :** అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను తమ పార్టీలో చేర్చుకోవడానికి పెట్టిన శ్రద్ధ పేద ప్రజల ప్రాణాలు కాపాడే 108 వాహన సౌకర్యం కల్పించుట కోసం ప్రయత్నించకపోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. సోమవారం శాయంపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విపత్కర పరిస్థితిలో పేద ప్రజల ప్రాణాలు కాపాడే అపర సంజీవని అయినా 108 వాహనాన్ని శాయంపేట మండలానికి కేటాయించాలని గత 4 సంవత్సరాలుగా స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డిని ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు కోరుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు ఆ దిశగా ప్రయత్నించక పోగా జిల్లా కేంద్రానికి 20కిలోమీటర్ల దూరంలో ఉన్న శాయంపేట మండలానికి అంబులెన్స్ అవసరమా అని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా మీకు పేద ప్రజల ఆరోగ్యం పై చిత్తశుద్ధి ఉంటే వెంటనే శాయంపేట మండలానికి 108 వాహనాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ మండల నాయకులు చిందం రవి, మారేపల్లి రవీందర్, లడే రాజ్ కుమార్, మారేపల్లి రాజు, కటయ్య, కొమ్ముల విష్ణు, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

# ఆకేరు వాగులో పడి మత్స్య కార్మికుడి మృతి

**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని గూర్తురు గ్రామ శివారు ఆకేరు వాగులో ఓ మత్స్య కార్మికుడు ప్రమాదవశాత్తు పడి సోమవారం మృతి చెందాడు. ఎస్ఐ జగదీష్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన పిల్లి చిన్న కుమార్ (37)రోజు వారీగా గ్రామ శివారు ప్రాంతమైన ఆకేరు వాగు చేపలు పడుతుండగా, ప్రమాదవశాత్తు నీటిలో జారీ పడడంతో పాటు వలలో చిక్కుకొని నీటిలో మునిగి మృతి చెందాడు. అనంతరం తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టు మార్టం నిమిత్తం తొర్రూరులోని ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. చిన్న వయస్సులోనే ప్రమాదవాశాత్తూ మృతి చెందండంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

# యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బీమా వినయ్ కుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని పెద్దమ్మగడ్డ ప్రాంతానికి చెందిన బీమా వినయ్ కుమార్ ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి గొట్టిముక్కుల సాగరిక రావు జారీచేశారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు అన్నివిధాలా కృషి చేస్తాన్నని తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, గొట్టిముక్కుల రమాకాంత్ రెడ్డి, రేపల్లె రంగనాథ్, అలువాల కార్తీక్, తోట పవన్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఆశా వర్కర్స్ నిరవధిక సమ్మె




**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు ఇస్తున్న పారితోషికాలను రూ.18వేలకు పెంచి ఫిక్స్ వేతనం నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్, సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి సమ్మెను ప్రారంభించారు. హనుమకొండ జిల్లాలో ఏకశిలా పార్కు వద్ద సమ్మెను ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ప్రారంభించి మాట్లాడుతూ గత 13సంవత్సరాలుగా ప్రజల ఆరోగ్యం కోసం నిత్యం శ్రమిస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గడిచిన తొమ్మిది సంవత్సరాల కాలంలో పలుమార్లు వినతి పత్రాలు అందించి ఆందోళనలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం మూలంగానే నేడు రాష్ట్ర వ్యాప్తంగా ఆశాలు సమ్మెలోకి పోవాల్సి వచ్చిందని తెలిపారు. ఆశాలకు పీఫ్,ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు అన్నింటిని ఆశా వర్కర్లకు వర్తింపజేయాలని, ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ఆశలకు ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలని, వెయిటేజీ మార్కులు నిర్ణయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీబీ లెప్రసి కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ భారత్ ఆన్ లైన్ సర్వేను ఆశా వర్కర్లతో చేయించరాదని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను రాబోవు కాలంలో తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు యాకూబీ చిన్నబోయిన, శ్రీవాణి ఈసంపెళ్ళి, శోభ బండి, లీల సింగారపు, రమ చినగారి, రాణి సకినాల, ఎల్లక్క తిప్పారపు, పద్మ ఈసంపెల్లి, వజ్ర, యస్.సుభాషిణి, కరుణలత, జే శ్వేతలతో పాటు ఆశాలు పాల్గొన్నారు.

# పరీక్షల రద్దులో తెలంగాణ ఫస్ట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేశంలోనే ఎక్కడలేని విధంగా పేపర్ లీకులతో, పరీక్షల రద్దులతో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాళ్లపల్లి అరుణ్ విమర్శించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ గ్రూప్ -1 ప్రిలిమ్స్ పరీక్ష రెండోసారి రద్దు కావడం దురదృష్టకమన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్లక్ష్య పూరిత వైఖరికి ఇది నిదర్శమని, గతంలో టీఎస్పీఎస్సీ నిర్వహించిన గ్రూప్ వన్ ఇతర ప్రశ్నాపత్రాలను అమ్ముకోవడానికి ప్రయత్నించి లక్షలాదిమంది నిరుద్యోగ జీవితాలను రోడ్డున పడేశారని ఆరోపించారు. అనేక ఉద్యమాలతో ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం వల్ల పరీక్షలను రద్దు చేసిందన్నారు. రెండోసారి నిర్వహించిన గ్రూప్ వన్ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణలో బయోమెట్రిక్ వివరాలు హాల్ టికెట్ నెంబర్లు లేకుండా ఓఎంఆర్ షీట్ ఇచ్చి పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో రెండోసారి గ్రూప్ వన్ పరీక్ష రద్దు చేయడం జరిగిందన్నారు. వెంటనే సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్ లో...

# మంగళవారం

ఐదేళ్ల క్రితం కార్తికేయ హీరోగా వచ్చిన 'ఆర్ఎక్స్100' చిత్రం ఎంత పెద్ద సంచలనం సృష్టించిందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ దగ్గర కోట్లు కొల్లగొట్టింది. ఎన్నో ఏళ్లుగా గుర్తింపు కోసం ఎదురు చూస్తున్న కార్తికేయకు విపరీతమైన పాపులారిటీ తెచ్చిపెట్టింది. ఇక ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన పాయల్ రాజ్‌పుత్ తన బోల్డ్ నటనతో యూత్‌లో తిరుగులేని పాపులారిటీ తెచ్చుకుంది. ఈ సినిమాతో దర్శకుడిగా మారిన అజయ్ భూపతి ఒక్క సారిగా ఇండస్ట్రీలో హాట్ టాపిక్ అయ్యాడు. పల్లెటూరి నేపథ్యంలో ఒక రా, రస్టిక్ లవ్‌స్టోరీతో నిర్మాతలకు పదింతలు లాభం తెచ్చిపెట్టాడు. ఈ సినిమా తర్వాత సిద్ధార్థ్, శర్వానంద్‌తో తెరకెక్కించిన మల్టిస్టారర్ 'మహాసముద్రం' తొలిరోజు మిక్స్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ దగ్గర అల్ట్రా డిజాస్టర్‌గా మిగిలిపోయింది. ఇక అజయ్ భూపతి దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం మంగళవారం. ఈ సినిమాలో పాయల్ రాజ్‌పుత్ లీడ్ రోల్ పోషిస్తుంది. రీసెంట్‌గా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు టీజర్ విడుదల కాగా ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ సాలిడ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ నుంచి విడుదల తేదీని రేపు ప్రకటించనున్నట్లు చిత్రబృందం సోషల్ మీడియాలో రాసుకొచ్చింది.





## ఇప్పుడు చాలా తెలివైనదాన్ని

ఆనందం, ఒకటో నంబర్ కుర్రాడు వంటి సినిమాలతో యూత్‌కు దగ్గరైంది హీరోయిన్ రేఖ. ఇతర భాషల్లోనూ రేఖకు మంచి అవకాశాలే వచ్చాయి. అయితే తెలుగులో మాత్రం రేఖకు మంచి హిట్లు పడ్డాయి. వాటితో ఎక్కువగానే గుర్తింపు వచ్చింది. కానీ ఆ తరువాత కాలంలో రేఖకు హిట్లు లేకుండా పోయాయి. క్రమంగా సైడ్ హీరోయిన్ పాత్రలను పోషించింది. చివరకు తెలుగు సినిమాలకు దూరంగా వెళ్లిపోయింది. చాలా రోజులకు బుల్లితెరపై రేఖ కనిపించింది. గత ఏడాది సుమ క్యాష్ షోలో, శ్రీదేవీ డ్రామా కంపెనీలో కనిపించింది. అప్పుడు రేఖ బాగానే కనిపించింది. కానీ ఇప్పుడు రేఖ అయితే ఎవ్వరూ గుర్తు పట్టనంత దారుణంగా మారిపోయింది. బక్క చిక్కిపోయింది. ఏదో వ్యాధితో బాధపడుతున్నట్టుగా కనిపిస్తోంది. కానీ ఆ సమస్య ఏంటో రేఖ మాత్రం క్లియర్‌గా చెప్పుకోలేకపోతోంది. ప్రతీ ఒక్కరి జీవితంలో ఎత్తు పల్లాలు అనేవి ఉంటాయి.. అది సహజం.. మన ప్రొఫెషన్ చూసి అలాంటివి జరగవు.. ఏం జరిగినా జీవితంలో ముందుకు వెళ్లాల్సిందే.. ప్రతీ ఒక్క ఘటన జీవితంలో మనకు గుణపాఠం లాంటిది.. ఏంతో నేర్పిస్తుంటుంది.. ఆ యాంగిల్‌లో చూసుకుంటే నేను ఇప్పుడు చాలా తెలివైనదాన్ని.. నాకు కొన్ని ఆరోగ్య సమస్యలు వచ్చాయి.. ఇప్పుడు కూడా ఉన్నాయి.. అనుకోకుండా జరిగింది.. చాలా మందికి ఆరోగ్య సమస్యలుంటాయి.. చిన్న తలనొప్పి కావొచ్చు.. పెద్ద రోగం కావొచ్చు.. కానీ ఎక్కువగా ఒత్తిడికి లోనవ్వద్దు.. ఆ ఒత్తిడి వల్లే ఆరోగ్య సమస్యలు పెద్దగా అవుతాయి.. ఆ దేవుడి మీద నమ్మకం ఉంచండి.. ఒక్కోసారి డాక్టర్లు ఇచ్చే మందులు పని చేయకపోయినా కూడా మన నమ్మకం మనల్ని కాపాడుతుంది అని రేఖ చెప్పిన మాటలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

## గణపతి పూజలో ..



బాలీవుడ్‌లో స్టార్ హీరోలంటే మనకు ముందుగా గుర్తొచ్చే పేర్లు షారుక్ ఖాన్, సల్మాన్‌ఖాన్. వీళ్లిద్దరి సినిమాలు విడుదలవుతున్నాయంటే చాలు థియేటర్ల వద్ద అభిమానులు సందడి మామూలుగా వుండదు. ఇక రీసెంట్‌గా వీరిద్దరూ షారుక్ పఠాన్ సినిమాలో కనిపించి సందడి చేశారు. అఫ్ స్క్రీన్ లో కూడా వీరి మధ్య మంచి అనుబంధం వుంది. ఈ ఇద్దరు స్టార్స్ ఎప్పుడు కలిసిన అది నేషనల్ వైడ్ వార్త అవుతుంది. ఇదిలా ఉంటే ఈ ఇద్దరూ మరోసారి కలసి సందడి చేశారు. మహారాష్ట్రలో ప్రతి ఏడాది గణేష్ చతుర్థి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతాయి. అయితే ఈ ఉత్సవాల సందర్భంగా ఆదివారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఇంట్లో గణపతి పూజ నిర్వహించారు. ఇక ఈ పూజలో పాల్గొనేందుకు బాలీవుడ్ సూపర్ స్టార్లు షారూఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, హాజరయ్యారు. పూజా అనంతరం షారూఖ్, సల్మాన్ ఇద్దరూ సీఎం ఏక్‌నాథ్ షిండేతో కలిసి ఫొటోలకు పోజులిచ్చి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి.

## మాస్ కా బాప్ .. స్కంద

రామ్ పోతినేని, బోయపాటి శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం స్కంద. ఈ సినిమా ప్రకటించినప్పటి నుంచి దీనిపై అంచనాలు భారీగా ఉన్నాయి. మాస్ కా బాప్ రేంజ్‌లో హీరోలను ఎలివేట్ చేసే బోయపాటి.. లవర్‌బోయ్ రామ్‌ను ఎలా చూపిస్తాడని అంతా అనుకుంటున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు, టీజర్, ట్రైలర్‌లను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉంటే ఈ సినిమా నుంచి మేకర్స్ రిలీజ్ ట్రైలర్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ నుంచి కొత్త ట్రైలర్‌ను ఈరోజు జరుగబోయే స్కంద ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో లాంచ్ చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.



## ఆ ఇద్దరితో చేయాలని ఉంది..

బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఆమె సినిమాలు, ఆమె మాటలు, కాంట్రవర్సీలు అన్నీ నెట్టింట్లో ట్రెండ్ అవుతూనే ఉంటాయి. అది మీటూ అయినా, నెపోటిజం మీద అయినా, ప్రభుత్వాల మీద అయినా కూడా కంగనా ఫైర్ అవుతూనే ఉంటుంది. ప్రస్తుతం కంగనా సౌత్ మీద ఎక్కువగా ఫోకస్ పెట్టింది. అప్పుడెప్పుడో ప్రభాస్‌తో కలిసి ఏక్ నిరంజన్ అని తెలుగు వారిని పలకరించింది. ఆ తరువాత మళ్లీ తెలుగులో సినిమా చేయలేదు. రీసెంట్‌గానే తలైవి అంటూ సౌత్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఇప్పుడు కంగనా చంద్రముఖి 2 అంటూ మరోసారి ఆడియెన్స్‌ను మెప్పించేందుకు రెడీగా ఉంది. సెప్టెంబర్ 28న ఈ చిత్రం రాబోతోంది. ఈ ప్రమోషన్స్ కార్యక్రమంలో భాగంగా తెలుగు మీడియాతో ముచ్చటించింది. ఆదివారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సందడి చేసింది. మీడియాతో ముచ్చటించే క్రమంలో మన హీరోల మీద తన అభిప్రాయాన్ని చెప్పింది. కంగనా అసలు పోకిరి సినిమాతోనే తెలుగులో లాంచ్ కావాల్సింది. కానీ ఆ టైంలో తన డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఇలియానా లైన్లోకి వచ్చింది. అయినా సరే పూరి మాత్రం కంగనాను వదల్లేదు. ఏక్ నిరంజన్ కోసం పట్టుకొచ్చాడు. అయితే పోకిరి సినిమాను మిస్ చేసుకున్నందుకు ఇప్పటికీ బాధపడుతూనే ఉంటాను అని కంగనా చెప్పుకొచ్చింది. రాజమౌళి సర్‌తో పని చేయాలని ఉంది.. రామ్ చరణ్ సర్‌తో నటించాలని ఉంది.. అల్లు అర్జున్‌తో కలిసి నటించాలని ఉంది అంటూ కంగనా మన స్టార్ల గురించి చెప్పుకొచ్చింది. చంద్రముఖి 2 సినిమాలోకి చివరగా కంగనా వచ్చిందట. పి వాసు వేరే కథను చెప్పేందుకు కంగనా వద్దకు వెళ్తే.. ఇంకా చంద్రముఖి పాత్రకు ఏ హీరోయిన్ ఫిక్స్ కాలేదని తెలుసుకుని, తానే నటిస్తాను అని అడిగి మరీ ఆఫర్ తీసుకున్నాను అంటూ కంగనా చెప్పిన మాటలు బాగానే వైరల్ అయ్యాయి.



# యువత ఆర్థికంగా ఎదగాలి

## మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

## తొర్రూరులో మెగా జాబ్ మేళా

## ఎంఎన్‌సీలు సహా 82 కంపెనీలు హాజరు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** 'యువత ఆర్థికంగా ఎదగాలి.. వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడాలి.. వారి కుటుంబాలు సుఖ సంతోషాలతో బతకాలి.. కన్న తల్లి దండ్రులకు మంచి పేరు తేవాలి..' అన్నదే తన సంకల్పమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. అందుకే నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి, ఉద్యోగ శిక్షణ ఇవ్వడమే కాకుండా జాబ్ మేళాలు ఏర్పాటు చేసి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరులోని ఓ ఫంక్షన్ హాల్ లో సోమవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాను మంత్రి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. మహబూబాబాద్ జిల్లా డీఆర్డీఏ, ఎర్రబెల్లి ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది. ఈ మేళాలో మల్టీ నేషనల్ కంపెనీలు సహా మొత్తం 82 కంపెనీల్లో సుమారు 14వేల ఉద్యోగావకాశాలకోసం నిర్వహించిన జాబ్ మేళాలో వేలాదిమంది నిరుద్యోగులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని తొర్రూరు, పెద్ద వంగర, రాయపర్తి మండలాల్లోని వారికోసమే మెగా జాబ్ మేళా నిర్వహించినప్పటికీ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వేలాదిగా యువతీ యువకులు తరలి వచ్చారు. ఎర్రబెల్లి ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా తొర్రూరుకు తరలి వచ్చిన ఆయా కంపెనీల ప్రతినిధులకు మంత్రి ఎర్రబెల్లి కృతజ్ఞతలు తెలిపారు. ఈ జాబ్ మేళాలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ ఇది అరుదైన అవకాశం అన్నారు. నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ డేవిడ్, అర్డీఓ, డీఆర్ డీఓ, ఇతర అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులు, పార్టీ, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎర్రబెల్లి ట్రస్టు బాధ్యులు పాల్గొన్నారు.

# సహకార సంఘానికి తోడ్పాటు

## ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని హౌసింగ్ బోర్డులో రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ ఏర్పాటు చేసుకున్న నూతన సహకార సంఘం సమావేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నాన్నారు. సహకార రంగాలను బలోపేతం చేసే దిశగా పనిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ తోడ్పాటుగా నా వేతనం నుంచి రూ.1,16,000 అందించడం జరిగిందన్నారు. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికి పోతున్నటువంటి వారికి భరోసా కల్పించి, ఐక్యత చేయాలని సంకల్పించి, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నానని వెల్లడించారు. పదవుల కోసం పనిచేస్తలేనని, మీతో ఉన్న అనుబంధం తోనే పని చేస్తున్నానని అన్నారు.

# అర్హులకు డబుల్ బెడ్ రూమ్

## ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** తెలంగాణ సర్కార్ పేద ప్రజల కోసం ప్రతిష్టాత్మకంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని దూపకుంటలో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సారధ్యంలో నిర్మిస్తున్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను సోమవారం కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా, ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారందరు డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో కలియతిరిగారు. విద్యుత్తు సదుపాయం త్వరిగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే పలు ఇండ్ల నిర్మాణాలు పూర్తి అయ్యి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని అతి త్వరలోనే అర్హులైన పేద ప్రజలకు అందిస్తామని వారు తెలిపారు.

# 30 వరకు ఉచిత కార్డియాక్ వైద్య శిబిరం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సంరక్ష సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు ఉచిత కార్డియాక్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు ప్రకటించాయి. డాక్టర్ దినేష్, డాక్టర్ మాధవి, డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ సిద్దార్థ ప్రసాద్, సీటీ సర్జన్ డాక్టర్ శ్రీనివాస్ ఆర్ దుస్సా ఆధ్వర్యంలో బ్రోచర్ , ఫ్లెక్సీని విడుదల చేశారు. ఈనెల 25నుంచి 30వరకు ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు ఐదుగురు సీనియర్ గుండె వ్యాధి నిపుణులచే ఈ శిబిరం నిర్వహించనున్నట్లు వెల్లడించాయి. ఉచిత కన్సల్టేషన్ తోపాటు ఉచితంగానే ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దిడ్డి శ్రవణ్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అజిత్ మొహమ్మద్, డాక్టర్ శిరిష్మ, డాక్టర్ లక్ష్మినారాయణ, డాక్టర్ పోలా నటరాజ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలి

## చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** రైతులకు త్వరలో రుణాలను పంపిణీ చేస్తామని చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ రెడ్డి ప్రకటించారు. సోమవారం చెన్నారావుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో 66వ వార్షిక మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ మాజీ వైస్ చైర్మన్, ప్రస్తుత సొసైటీ డైరెక్టర్ గూళ్ళ కవిత భర్త న్యాయవాది గూళ్ళ అశోక్ కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం సొసైటీ సీఈఓ చిట్టె రవి సొసైటీ వార్షిక మహాసభ నివేదికను చదివి వినిపించారు. తదనంతరం సొసైటీ అభివృద్ధిపై సభ్యులతో చర్చించారు. దీంతో సభ్యులు గత సమావేశాల్లో జరిగిన తీర్మానాలను వెంటనే ఆమోదించాలని, ప్రభుత్వం నుంచి రుణమాఫీ కింద వచ్చిన రుణాలను రైతులకు వెంటనే పంపిణీ చేయాలని సొసైటీ సభ్యులు ఈగ సత్యనారాయణ, మంచాల సదయ్య, పత్తి అనంతరెడ్డి, గరికపాటి హనుమంతరావు తదితరులు కోరారు.

# సైకాలజీలో గోపికి డాక్టరేట్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ ఏవీవీ కళాశాలకు చెందిన ఫిజకల్ డైరెక్టర్ బరుపాటి గోపి అరుదైన ఘనత సాధించారు. వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే సైకాలజీ విభాగంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. సమ్ ఫ్యాక్టర్స్ రిలేటేడ్ టు ద అకాడమిక్ అచీవ్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ అండ్ ప్రైవేట్ సెక్టార్ హై స్కూల్ అండ్ కాలేజీస్ స్టూటెండ్స్ అనే అంశంపై శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ సైకాలజీ విభాగం ప్రొఫెసర్ జి.బాబురావు పర్యవేక్షణలో గోపి పరిశోధన గ్రంథం సమర్పించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్లు సీమ, బాబురావు, ప్రసాద్ బాబు, సింహచలం, సోమశేఖర్ సోమవారం పీహెచ్‌డీ సర్టిఫికేట్ ప్రదానం చేశారు. దీంతో బరుపాటి గోపిని పలువురు అభినందించారు. వ్యాయామ అధ్యాపకుడిగా పనిచేస్తూనే రచయితగా అనేక పుస్తకాలను రాయడంతోపాటు గత ఇరవై సంవత్సరాలుగా మోటివేషనల్ స్పీకర్‌గా లక్షలాది మంది యువతకు ప్రేరణ ఉపన్యాసాలు ఇచ్చారు. టెన్త్ , ఇంటర్, డిగ్రీ, బీటెక్, మెడిసిన్ విద్యార్థులకు ఆడియో, వీడియోల ద్వారా సైకాలజీ క్లాస్‌లు తీసుకున్నారు.

# ఘనంగా ఘంటసాల గానావధానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** రామన్నపేటలోని భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘంటసాల గానావధానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని పోతన విజ్ఞాన పీఠం ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఒరిస్సాకు చెందిన డాక్టర్ సయ్యద్ రహమతుల్లా పర్లాకిమిడి తన గానామృతంతో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం పలువురు నటీనటులచే ఘంటసాల జీవిత ఘట్టాలను ప్రదర్శించగా, గాయకులు ఆయన పాడిన పాటలను ఆలపించారు. డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ సయ్యద్ రహమతుల్లాతోపాటు డాక్టర్ కె.రామకిషోర్, గాయని సావిత్రి ప్రభాకర్ ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. డాక్టర్ కె.రామ కిషోర్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఘంటసాల అభిమానులు, ప్రేక్షకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డెంగీతో జరభద్రం: కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** డెంగీతో జరభద్రంగా ఉంగడాలని 40 వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి కోరారు. ఈ వ్యాధి సోకి ఆసుపత్రి పాలవుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. సోమవారం తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో ప్రభుత్వం సంక్షేమ పథకాలైన పరిసరాల పరిశుభ్రత, ఓటు హక్కుపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మరుపల్ల రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కళాకారులు పాడిన పాటలతో చైతన్యవంతులు అవుతారన్నారు. ప్రజల సంక్షేమ కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు, ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కు ప్రజలందరూ అండగా ఉండాలన్నారు. కళాకారులు పాడిన పాటలకు ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు జూపాక శివ, కందగట్ల రామకృష్ణ, మారుమూల ఆనంద్, రామంచ భద్రయ్య, జడల శివ, ఈటెల సమ్మయ్య, ఎలబోయిన రాజు, ఇల్లందుల సతీష్, జడల హరిత, మైదం ఝాన్సీ, మాటేటి అనిత, గుగులోతు సాలమ్మ, మేకల విజయ, నాయకులు మరుపల్ల గౌతమ్, వంగరి సురేష్, ఆర్పీ పసునుటి సంధ్య పాల్గొన్నారు.

# గణపయ్యకు 108 రకాల నైవేద్యాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** గణపతి నవరాత్రి ఉత్సవాలను సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ లో అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం గణనాథునికి 108 రకాల ఫల, పిండి పదార్థాలతో తయారు చేసిన నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా సత్యం సంస్థల అధినేత, బీజేపీ నాయకుడు గంట రవికుమార్ మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో పూజిస్తే సకల కోరికలు నెరవేరుతాయన్నారు. కొన్నేళ్ళ నుంచి తమ సంస్థలో నవరాత్రి వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలంతా స్వామివారి కృపతో సుఖ సంతోషాలతో ఉండాలని రవి కుమార్ ఆకాంక్షించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com